# కొత్త రచయితలు

# ''బ్లాసీ''

ఆకాశం రంగు నేపథ్యంలో నెమలి కన్ను రంగు పాపలతో సువిశాలమైన కనులు—

ఆ కళ్ళలో నవ్వుతూ పలకరిస్తూన్న భావన—

సన్నని గీతల్లా వున్న తేనె రంగు కను బొమ ల మధ్యగా గులాబి

రంగులో పొడవుగా మొనతేలివున్న సన్నని ముక్కు—

ఆ ముక్కుని చూస్తే ఆహ్లాదంగా వెక్కిరిస్తున్న తలపు—

మందార రంగులో చక్కగా తీర్చిన పల్చని పెదాలు—

వెలలేని చిర్నవ్వులు గాని వెనుక దాచుకున్నాయా అనిపించే ఆ పెదాలు—

నున్నని గుండ్రని గులాబి బుగ్గలు—

ఒత్తయిన, మెత్తని, నల్లని, గిరజాల జుత్తు — ''పోనీ టెయిల్'' లా! దాని పేరు ''బ్లాసీ''

'బ్లాసీ' అంటే అయిదు సంవత్సరాల ''నిచ్చి''కి చెప్పలేని పిచ్చి.

దానిని ''బొమ్మ'' అని ఎవరైనా అంటే దానికి అవధుల్లేని కోపం.

అది చీకటితో లేవగానే, తన పక్కలో వున్న బ్లాసీని ముందు చూసి తీరాలి. అది బ్లాసీని పలకరిస్తుంది. మాట్లాడుతుంది. ఉత్తుత్తినే కడుగుతుంది. స్నానం చేయిస్తుంది. 'ఆమ్'

తినిపిస్తుంది. ఏ పనీ ముందు బ్లాసీ చెయ్యకుండా అది చెయ్యదు.

''ఓసినీ — నిచ్చీ — పోను పోను నీకు పిచ్చి మాలావు ముదురు తుండాదే. తొందరగా లెగసే... పన్లో కోవాల— ఆలీసమయిపోతుండాది..'' అమ్మ ఉదయాన్నే వేసే 'పొలికేక' దానికి రోజూ మామూలే. అయినా అది తొందరపడదు. ఎంతో నిదానంగా బ్లాసీని తనతోపాటు మోస్తూనే వుంటుంది.

''ఓసి నిచ్చీ నువ్వీడ కూకోనుండు.. ఆకలవుతే ఆ కొమ్మకేసిన ముంతలో యింత గంజి వుండాది తాగు..' తను కూలి పని చేసే ప్రాంతంలో 'నిచ్చి'ని చల్లని నీడనిచ్చే విశాలమైన చక్కటి చెట్టుకింద కూర్చోబెడుతూ వాళ్ళ అమ్మ రోజూ చెప్పే మాటేయిదీ. తల్లి పనిలో వున్నంత సేపూ — నిచ్చికి బ్లాసీతోనే కాలక్షేపం... బ్లాసీ...

నిచ్చి తల్లి మాణిక్యమ్మ ఓ ఆఫీసరు గారింట్లో పని చేస్తూండేది ఏడాది క్రితం. పని లోకి పోతూ తన కూతురు 'నిచ్చమల్లి'ని కూడ తీసుకుపోతూండేది. ఆ ఆఫీసరు గారికి నిచ్చమల్లి కంటె కొద్దిగా పెద్దదైన పాప వుండేది. మాణిక్యమ్మ పని చేసుకున్నంత సేపూ ఈ పిల్లలిద్దరూ ఆడుకుంటుండేవారు. వారి ఆటలో ప్రధాన పాత్ర 'బ్లాసీ'ది. 'బ్లాసీ' ఆఫీసరు గారి అమ్మాయికి అతి యిష్టమైన రబ్బరు బొమ్మ. దాని నీలి కళ్ళ వల్లనో ఏమో వాళ్ళింట్లో దానిని 'బ్లాసీ' అని పిలుస్తుండేవారు.

ఆ బ్లాసీతో 'నిచ్చమల్లి' అనిర్వచనీయమైన అనుబంధం ఏర్పరుచుకుంది.

అదెప్పుడూ తన దగ్గరే వుండాలని దాని బుల్లి గుండె నిండుగా కోరిక—

## లవ్ స్టోరి

ఆడుకున్నంత సేపు ఆడుకోగా, తల్లి పని ముగించుకొని వెళ్ళేటప్పుడు బ్లాసీని వదల్లేక వదల్లేక వదిలి వెళ్ళేది. ఓ సారి బ్లాసీ తనకి కావాలని మారాం చేస్తే అమ్మ తనని చితగొట్టి వదలటం అది ఎప్పటికీ మర్చిపోలేదు.

తాను బ్లాసీ కావాలని అడిగితే అమ్మకంత కోపం ఎందుకు రావాలో తెలియక పోయినా, తాను ఆ బొమ్మని అడగకూడదని మాత్రం అర్థం చేసుకుంది ఆ పసి మనసు.

అయితే తను ఆ బొమ్మని అడిగినప్పుడు బాధినందుకూ, ఒక్క బొమ్మేనా ఉన్న ఒకానొక పిల్లకీ కొనివ్వలేని తన దురవస్థకీ ఆ పేద తల్లి తరువాత ఎంత కుమిలి ఏడ్చిందో కూడ దానికి తెలియదు.

ఒక రోజు—

ఆ రోజు 'నిచ్చి' లేత మనసు మురిసిన రోజు — మరువలేని రోజు — దాని కోరిక తీరిన రోజు—

బదిలీ మీద వెళ్ళిపోతున్నప్పుడు, ఆఫీసరుగారి భార్య వెనుకవైపు కొద్దిగా చిరిగిన బ్లాసీ బొమ్మని పెరట్లోకి విసిరేసింది.

అప్పుడక్కడే వున్న నిచ్చి బ్లాసీ పడిన వేపు ఒక్క ఉరుకున పరుగెత్తింది.

దానికి దెబ్బతగిలిందేమోనని కంగారు పడిపోయింది.

పైకితీసి, దాన్ని ఓదారుస్తూ గుండెలకి హత్తుకుంది.

''నిచ్చీ! నీకు బ్లాసీ అంటే చాలా యిష్టం కదా... కావాలంటే తీసుకో...'' ఆఫీసరు గారి భార్య అంది.

'ఈ మాట తన ముద్దుల బ్లాసీని విసిరి కొట్టక ముందే చెప్పొచ్చుగా' దాని బుల్లి మెదడులో సమాధానం దొరకని ప్రశ్న!

అప్పట్నుంచి నిచ్చికి బ్లాసీయే లోకం.

చినిగిన ఆ బొమ్మని తన తల్లి కుట్టిబాగు చేసి యిచ్చేవరకూ ఊరుకోలేదు.

మాణిక్యమ్మకి కూడా 'బ్లాసీ' అంటే యిష్టమే.

ఎందుకంటే అది నిచ్చి ఎదురుగా వుంటే—

''అప్పుడప్పుడు నిచ్చికి యిచ్చేందుకు యిన్ని పాలు కూడా కొనలేని తన అశక్తతని బయట పడనివ్వదు''

''ఏ రోజన్నా యింత గంజి పోయలేక పోయినా ఆ లోటు నిచ్చికి తెలియనివ్వదు''

''తన పనిలో మరింత సేపు వుండాల్సి వచ్చినా నిచ్చిని తన కోసం ఏడవ నివ్వదు''

'నిచ్చి' అంటే ప్రాణం మాణిక్యమ్మకి.

తన గుడిసె ముంగిట్లో నిత్యం పూసే 'నిత్యమల్లి' పూలంటే ప్రాణం మాణిక్యమ్మకి. తన ఒక్కగానొక్క కూతురికి అదే పేరు పెట్టుకుంది. ముద్దుగా 'నిచ్చి' అని పిల్చుకుంటూ వుంటుంది.

''మానిక్కెం'' పెద్దగా అరుచుకుంటూ, పెద్ద పెద్ద అంగలేసుకుంటూ

గుడిసెలో దూరాడు వీరన్న —మాణిక్యం మొగుడు — నిచ్చి నాన్న.

''ఏంటా పొలి బొబ్బలు?'' విసుక్కుంది నూకలు చెరుగుతున్న మాణిక్యం.

''ఇయ్యాల నీ కూలి డబ్బులెయ్యే?'' అథార్టీగా అడిగాడు.'

''లెవ్వు... ఇన్ని గింజలు తెచ్చినా..''

''థూత్.. నీ.. యదవ కొంపా.. దరిద్రపు దానా... మొగుడి కోసం యిన్ని కాసులు సంపాయించ లేని దానివి నువ్వా ఓ పెళ్ళానివేనా?'' చుక్కకి డబ్బులేక వాడికి తిక్కరేగుతూంది.

''ఓలమ్మో! నువ్వో పెద్ద మొగుడువి. రోజంతా రిచ్చాలాగినా నీ చుక్కకి సరిపడా సంపాయించుకోలేవు గానీ.. సిగ్గు లేక పోతే సరి... ఏనాడన్నా ఓ కాసు కొంపకి తెచ్చినావా? ఎట్టా గదుస్తుంది

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఎట్టా తింటున్నానన్న ఊసుందా... అదంతా పోసీ... కనీసం పసి దానికి పుట్టాక ఒక్క బొమ్మనన్నా కొనెరిగినావా?"

యిదంతా నిచ్చి ఆసక్తిగా గమనిస్తూ వుండేది. అలాంటి సందర్భాల్లో దాని మనసులో ఏదో తెలీని వెలితి అనుభవిస్తూ వుండేది.

ఎందుకో తెలియకపోయినా, అయ్యవేసే చిందులూ.. అమ్మవేసే కేకలూ... నిచ్చికి నిత్యకృత్యమే.

"ఎందుకయ్యా అమ్మనలా అరుత్తావే.. పాపం అమ్మ మనకి రోజూ గంజి, అన్నం చేసి పెట్ట టంలా... "ముద్దు ముద్దు మాటలతో అయ్యతో అంటుంది.

"ఆ అలాగడ్లెట్టే.. అయినా ఆడికి బుద్ది ఏడనుంచొత్తాది?" నిచ్చిని అక్కున చేర్చుకుంటూ మాణిక్యం ఛీత్కారం..

"ఓసోస్... నీకు మాలావు బుద్దుందే పిచ్చినా.. మగాణ్ణి ఎంత మాట పడితే అంత మాట అనటమేనా.." తన కోపమంతా నిచ్చి చేతిలోని బ్లూసీ మీద చూపాడు వీరన్న. నిచ్చి చేతిలోంచి ఆ బొమ్మని లాగి విసిరికొట్టి బయటికి పోయాడు.

నిచ్చిప్రాణం గిల గిల్లాడి పోయింది.

మధ్యలో బ్లూసీ తప్పేమిటో దీని కర్థం కాలేదు.

నీళ్ల నిండిన కళ్ళతో బ్లూసీని ఎత్తుకుని అమ్మని అడిగింది.

"ఏంటీ అమ్మా... అయ్యని నా బూసీ ఏంచేసినాదే?" అని!

"ఆ ఎదవ సచ్చినాడంతే లెయ్యే... ఆడికంత కంటే ఏటి చాతొచ్చు?" తిరిగి తన పనిలో పడుతూ అంది మాణిక్యం.

ఇలాంటివే ఎన్నో సంఘటనలు. ఇంటిలోని ఇలాంటి పరిస్థితి నిచ్చికి నచ్చేది కాదు.

తనకి ఏం నచ్చలేదో... ఎలా వుంటే నచ్చేదో దీని చిన్న బుర్రకి ఆలోచించే స్థాయి లేదు.

రోజులు - నెలలు - సంవత్సరాలు గడుస్తూనే వున్నాయి.

నిచ్చి యించక్కా పెరిగి పెద్దదయింది.

బ్లూసీ మాత్రం ఎన్నేళ్ళయినా అలాగే మారకుండా వుండిపోయింది.

ఇప్పటికీ బ్లూసీని వదలి వుండలేదు నిచ్చి.

ఇది ఆ చుట్టుపక్కల గుడిసెల్లో వాళ్లందరికీ విడ్డూరం

"చిన్న పిల్లలా ఇంకా ఆ బొమ్మతో ఆటలేమిటీ?" అంటూ వెటకారం చేస్తుంటారు.

నవ్వి వూరు కుంటుంది నిచ్చి.

**   **   **

కాలం రజతోత్సవం జరుపుకుంది.

దేశం కొత్తగుడ్డలు తొడుక్కుంది.

విజ్ఞానం విర్ర వీగుతూంది - కలిమి మిడిసి పడుతూంది.

నాగరికత 'నట్టువాక్కం' చేస్తూంది. కానీ సోషలిజం 'ఆరంగేట్రం' చేసుకోలేదు.

ఆ గుడిశెల వాడ మాత్రం మారలేదు. అలాగే వుంది.

తాగి తాగీ రక్తమంతా చుక్కతో పల్చబడిపోగా, అడ్డపడి ఆగిపోయాడు వీరన్న - నిచ్చినాన్న.

ప్రతిక్షణం కాయ కష్టంతో పాటుబడ్డ మాణిక్యం కృశించి, నశించి పోయింది. పోతూ - పోతూ—

తన ప్రాణ సమానమైన నిచ్చిని - లచ్చన్న చేతిలో పెట్టి పోయింది. లచ్చన్న కూడా రిక్షా లాగుతాడు.

సంది పడేసరికి నిండుగా తాగుతాడు.

కాసులు చాలకపోతే గుడిసెకి చేరుతాడు.

అడిగిందివ్వకపోతే పెళ్ళాన్ని పిచ్చి కొట్టుడు కొడతాడు.

**   **   **

గుడిశె ముందు కూర్చుని నూకలు చేస్తుంది నిచ్చి.

ఇప్పుడు దానికి అయిదారేళ్ల కూతురు మల్లి.

'మల్లి' అంటే నిచ్చికి ప్రాణం.

'మల్లి'కి 'బ్లూసీ' అంటే ప్రాణం.

తరం మారింది.

తూలుకుంటూ వచ్చి ముంగిట్లో వున్న నులక మంచంమీద దభీల్న వాలాడు లచ్చన్న.

"నిచ్చి... యిట్టారాయే..." చేతనైనంత గట్టిగా అరిచాడు.

బ్లూసీతో అడుకుంటున్న మల్లి వులికి పడింది.

'నిచ్చి'కి ఇది మామూలే.


"ఓసి... మల్లీ... నూకాలత్తకాడికోయి అయ్య కోసం ఓ గ్లాసు మజ్జిగట్రాయే..."మల్లిని బయటికి పంపే ఆలోచన అది. అలాంటి సందర్భంలో 'మల్లి' అక్కడ వుండడం నిచ్చికి నచ్చదు.

"మజ్జిగ తెస్తాగానీ... నా పాపని జాగర్తగా చూస్తూండయ్యా...'"మల్లి బ్లూసీని వాళ్ళయ్య పక్కని నులకమీద పడుకోబెట్టి చర్రున బయటికి దూసుకుపోయింది.

"ఛీ... నీయవ్వ... నిచ్చి నువ్విటు రాయే... నా పక్కలో ఈ పాడు బొమ్మేందే?..." బ్లూసీని విసిరి కొడుతూ అరిచాడు.

నిచ్చి ప్రాణం గిలగిల్లాడిపోయింది.

ఇలాంటి సమయాల్లో తన చిన్న తనం దానికి లీలగా గుర్తుకు వస్తూంటూంది. తానప్పుడు తన



అమ్మని అడిగిన ప్రశ్నలూ గుర్తుకి వస్తాయి. తల్లి తన తండ్రిని ఈసడిస్తూ చెప్పిన సమాధానాలు గుర్తుకి వస్తాయి. కాని అలాంటి సమాధానాలు తన 'మల్లి'కి చెప్పడం దానికిష్టముండదు. అసలలాంటి సంఘటనలు మల్లి దృష్టిలో పడడం దానికెంత మాత్రం నచ్చదు. తన చిన్నప్పుడు తమ గుడిశెలో ఏ సన్నివేశాలు, ఏ వాతావరణం దానికి నచ్చేది కాదో వయస్సుతో బాటు అర్థమవుతూ వచ్చాయి. దాని జ్ఞాపకాల్లో బ్లూసీని తన కిచ్చిన ఆఫీసరుగారి పాపే కదుల్తూ వుంటుంది. దీని మనస్సులో వారి జీవన స్థితిగతుల్నీ, స్థాయినీ మించిన సంస్కృతి తాలూకు భావాలు కదులాడుతాయి. ఈ ప్రజా స్వామ్యానికి కాస్త పరపతీ, మరికాస్త విలువా వుంటే, దానికున్న భావనలకీ, సమర్థతా స్థాయికీ వారి జీవితాలు ఈ స్థాయిలో వుండేవి కావేమో!

తను అరిచిన వెంటనే పక్కమీదికి చేరనందుకు అసహనంగా వున్నా, పిల్లని బయటికి పంపినందుకు మెచ్చుకోలుగా... మాంఛి వేడి మీదున్న లచ్చన్న నిచ్చిని ఎంతో కచ్చగా తన మీదికి ఒక్క గుంజు గుంజుకున్నాడు.

పరధ్యాసలో పడ్డ నిచ్చి ఉలికిపడింది. ఆ గుంజుడుతో, "ఏమయ్యో! ఏందది మరీ... కొంచెం సేపు తాళు... పిల్లదాన్ని నిద్రపుచ్చొద్దూ..." మగడితో అంది మెల్లగా, అనునయంగా. అంతలో లోటాతో మజ్జిగతో రానే వచ్చింది మల్లి. దాని 'బ్లూసీ' దూరంగా గుడిసె నిట్టాట పక్కగా పడివుండడం చూసింది.

దాని విశాలమైన కళ్ళలో ప్రస్ఫుటంగా బాధ... కోపం "అమ్మా... ఏందే ఇది... నా బ్లూసీని ఇట్టా పడేశారు?" నిచ్చి తల పుర్లో చిన్న ఆలోచన.


"ఏం లేదే మల్లీ... నీ అయ్య బ్లూసీతో దాగుడు మూతలాడుతున్నాడు. అందుకని అది ఆడ దాగుంది..."

"హాయ్... హాయ్..." మల్లి కళ్ళలో బాధ, కోపం స్థానంలో చెప్పలేనంత ఆనందం, సంబరం.

"నా బ్లూసీ ఆటలు కూడా ఆడతాందా. అయితే నేనూ ఆడతా..." గంతులేస్తూ అంది.

"యిగ చాలా పొద్దుపోయింది గానీ... పడుకోయే మల్లి... సీకటితోనే లేపుతా... అప్పుడాడుదువుగానీ..."

"అలాగేనే అమ్మా..." అంటూ ఎంతో మురిపెంగా,




రచయిత చిరునామా

జె.గంగాధర ప్రసాదరావు

హౌస్.నెం. 4-49-14

చౌదురమ్మ స్ట్రీట్

ఐతానగర్, తెనాలి


ముచ్చటగా బ్లూసీని అదుముకుని పడుకుంటూంది మల్లి. తన చిన్న తనంలో తన నావరించే నిరుత్సాహం; తన 'మల్లిని' తాకనందుకు ఎంతో తృప్తి పడుతుంది నిచ్చి.

నిబ్బరంగా నిట్టూరుస్తుంది.

తన మల్లి ఆఫీసరుగారమ్మాయిలా కావాలని ఆలోచించుకుంటూ పడుకుంటుంది నిచ్చి.

అప్పటికే తన ఆత్రం తీర్చుకుని దిక్కులు పిక్కటిల్లేలా పెట్టే లచ్చన్న గురక దాని ఆలోచన్లని సాగనివ్వదు - నిద్రరానివ్వదు.

